నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రాంపూర్-బి గ్రామానికి చెందిన గాడ్గే సునీత ఇటీవల అనారోగ్యానికి గురైంది. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో ప్రభుత్వం ఆమెకు రూ.15వేలు మంజూరు చేసింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆమెకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యవంశీ సుభాష్, అశోక్ పాల్గొన్నారు.



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని వినతి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ ఆత్మ మాజీ చైర్మన్ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సూరజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులు అరుగాలం కష్టపడి పండించిన జొన్న పంటను పూర్తిగా ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు భీమ బుచ్చన్న, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మడావి మారుతి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మడావి భీమ్‌రావ్, నాయకులు మహేందర్ పాల్గొన్నారు.



ముగిసిన సీసీఐ సాధన కమిటీ దీక్షలు

- పునరుద్ధరణకు ఎన్ని పోరాటాలకైనా సిద్ధం : మాజీ మంత్రి జోగు రామన్న



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, పాల్గొన్న సీసీఐ సాధన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పరిశ్రమ పున:ప్రారంభమైతే ఆదిలాబాద్ జిల్లా ముఖ చిత్రం మారుతుందని, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఎన్ని పోరాటాలు చేసేందుకైనా సిద్ధమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. మార్చ్ 19 నుండి దీక్షలు ప్రారంభం కాగా రోజుకు కొందరు దీక్షల్లో కూర్చొని సంఘీభావం ప్రకటించారు. సీసీఐ ఉద్యమంలో భాగంగా ఢిల్లీకి సైతం వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాగా దీక్షల విరమణలో జోగు రామన్న పాల్గొని దీక్షల్లో కూర్చున్న వారికి నిమ్మరసం అందించి విరమింపజేశారు. సీసీఐ సాధన కమిటి ద్వారా చేపడుతున్న ఉద్యమాలను కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సీసీఐ పున:ప్రారంభానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేనప్పటికీ అన్ని విధాలా తమ వంతు సహకారం అందిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వందేళ్లకు సరిపడా ముడిసరుకు కలిగిన ఫ్యాక్టరీ ప్రారంభమైతే జిల్లా అభివృద్ధి పథాన నడుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయమై సాధన సమితి సభ్యులతో కలిసి ఢిల్లీకి వెళ్లామని తెలిపారు. ఎంపీ గోడం నగేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా అహంకారపూరితంగా సమాధానాలు ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ ఆవశ్యకతను వివరిస్తే అయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆరు నెలల్లో ఫ్యాక్టరీ పునరుద్ధరణపై స్పష్టత ఇస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సిసిఐ పునరుద్ధరణ జరిగేంత వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఆదిలాబాద్ భవిష్యత్తును సైతం రియల్ ఎస్టేట్‌గా మార్చుకొని భవిష్యత్తు ఆదిలాబాద్ పైనీళ్ల చల్లుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఐ సాధన కమిటీ సభ్యులు పోశెట్టి, గుడిపెల్లి నగేష్, కొండ రమేష్, బొల్లు ఈశ్వర్, ఎస్.అరుణ్ కుమార్, విఠల్, వెంకట్‌నారాయణ, జగన్, బొజ్జ ఆశన్న, దాసరి రమేష్, దర్శనాల నగేష్, సిర్ర దేవేందర్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాధిక

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉపాధ్యాయులందరూ పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి జి.రాధిక అన్నారు. శుక్రవారం జిల్లాలో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు పంచశీల్ బీఎడ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న ఫోక్సో చట్టం, అందులో గల వివిధ రకాల సెక్షన్లు, వాటికి గల శిక్షల గురించి కూలంకషంగా వివరించారు. ప్రస్తుతం వివిధ సంస్థల్లో, పని ప్రదేశాల్లో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు తమ విద్యాలయాల్లో బాలబాలికల ప్రవర్తనను అనునిత్యం గమనించాలని సూచించారు. ఇంటివద్ద, బడిలో, బడికి వచ్చే దారిలో, పొలం పనులకు వెళ్లినప్పుడు, పని ప్రదేశాలలో, బహిరంగ ప్రదేశాల్లో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నుండి తప్పించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయినులు బాలికలకు వివరించాలన్నారు. ముఖ్యంగా బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు కూడా దీని గురించి, ఫోక్సో చట్టం గురించి, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమావేశాల్లో పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నర్సయ్య, సలోమీ, కరుణ, మండల విద్యాధికారులు వైవి రమణారెడ్డి, తోడిశెట్టి పరమేశ్వర్, వట్టోలి ముత్యం, రిసోర్స్ పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి సన్మానం

మహాత్ముల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సారంగాపూర్: మహాత్ముల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది అన్నారు. శుక్రవారం మండలంలోని వంజర్, చించోలి (ఎం), జౌళి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన రాజ్యాంగాన్ని కాపాడాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జై బాపు..జై భీమ్...జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సమ న్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను కాలరాస్తున్నారని తెలిపారు. బీజెపి పాలకుల తీరు తీవ్ర ఆక్షేపణీయంగా ఉందన్నారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మన్, స్వదేశ్, సత్యం, రమేష్, సాయన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సారంగాపూర్: మహాత్మగాంధీకి నివాళి అర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌రూరల్ : సోన్ మండలం సంగంపేట, వెల్మల్ గ్రామాలలో జై బాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సౌభ్రాతృత్వం, సమానత్వంతోనే తాము ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. తదనంతరం స్థానిక ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నూరుద్దీన్, నరసింహారెడ్డి, స్వామి, రామచంద్రారెడ్డి, అంబేకర్ ప్రసాద్, నర్సయ్య, గంగాధర్, రాజేశ్వర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, జనరల్ సెక్రెటరీ ముత్తె సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన, గాంధీ చూపిన బాటలో నడుస్తూ దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తెలిపారు. బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకొల్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పింగిలి రమేష్, ఆర్టిప సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిర్మల్ రూరల్ : మహాత్ములకు నివాళి



లక్షెట్టిపేట : తిమ్మాపూర్‌లో ర్యాలీ

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలోని ముస్లింలు, న్యాయాన్ని ప్రేమించే పౌరులందరు తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు తెలిపినా పార్లమెంటు ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదించడాన్ని ఖండిస్తున్నట్లు ముస్లిములు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రార్థనల తర్వాత మొహల్లా బడాలోని మోతీ మసీదు ప్రాంగణంలో ముస్లిములు వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిములు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ముస్లిములలో ఆగ్రహం, నిరాశ నెలకొన్నాయన్నారు. సవరణ బిల్లు ముస్లిముల మతపరమైన, రాజ్యాంగ పరమైన హక్కులపై ప్రత్యక్ష దాడి అని అన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేమని పేర్కొన్నారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముజాహిద్ అలియాస్ పత్తి ముజ్జు, హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఇంతెఖాబ్ ఆలం, నవాబ్, సర్దార్ ఆలం పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని గుల్జార్ మసీదులో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మైనారిటీలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఆమోదించబడిన వక్ఫ్ సవరణ బిల్లును తాము వ్యతిరేకమని అన్నారు. ఆమోదించిన సవరణలు వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయని తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం లక్ష్యం



నవతెలంగాణ-నస్పూర్

ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం లక్ష్యమని షీ టీం ఎస్సై హేమ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి శిక్షణ కేంద్రంలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలపాలన్నారు. మహిళలకు ఏదైన సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుపై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల నుండి, మరే ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700ను సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిటీసీ మేనేజర్ రామారావు, షీ టీం సభ్యులు జ్యోతి, శ్రీలత, శిక్షణ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్నాపూర్‌లో చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పట్నాపూర్ గ్రామంలో శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏజీపీ పంద్రం శంకర్ మాట్లాడుతూ ప్రజలు వారి నిజ జీవితంలో చట్టాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బైక్ నడిపే వారు విధిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కల్గి ఉండాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ తొడసం గోపాల్, ఉప సర్పంచ్ కైలాష్ పటేల్, నాయకులు నీలకాంత్‌రావ్, పూజారి కుంరం గంగారాం, పెసా కో ఆర్డినేటర్ సిడాం జైతు, దుర్వ రాంచందర్, ఆత్రం మోహన్, దశరథ్ పాల్గొన్నారు.

ట్రైనింగ్‌లో ఫోన్ వాడకాన్ని నియత్రించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఎన్ఎం, పారామెడికల్ విద్యార్థులు రిమ్స్‌లో ట్రైనింగ్ సమయంలో మొబైల్ వాడకాన్ని నియంత్రించి సక్రమంగా ట్రైనింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ కోరారు. ఈ విషయమై శుక్రవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పారా మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అదేవిధంగా ప్రభుత్వ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అనంతరం రిమ్స్‌లో ట్రైనింగ్ చేయడానికి వచ్చిన విద్యార్థులు వారికి కేటాయించిన విభాగంలో సక్రమంగా ట్రైనింగ్ చేయడం లేదని ఆరోపించారు. రిమ్స్ భవనం మెట్లపై కూర్చొని బయట నుంచి వచ్చిన వ్యక్తులను తరచుగా కలుస్తూ రోగులతో వచ్చిన వారికి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ కో కన్వీనర్ నిఖిల్, హాస్టల్స్ కన్వీనర్ మహేష్, శివసాయి పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకోవాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసుల మీ కోసం కార్యక్రమాన్ని ప్రతివారం ఒక్కో గ్రామంలో ఏర్పాటు చేస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నూతన సైబర్ క్రైమ్‌లపై, నూతన చట్టాలపై, అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యపరచాలని సూచించారు. శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. సిబ్బంది దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో నిజాయితీగా బాధితులకు న్యాయం చేకూరే విధంగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులలో చార్జి షీటు దాఖలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా పోక్సో కేసులలో నిర్ణీత సమయాలలో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక అందజేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపే దిశగా ప్రతి ఒక్కరు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. గంజాయి స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులు, పోక్సో కేసులు, అండ్ ఇన్వెస్టిగేషన్ కేసులపై విచారణ జరిపి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో రిసిప్షనలిస్టు పాత్ర కీలకంగా ఉంటుందని, బాధితులకు సరైన న్యాయం, సరైన సమయంలో అందించే విధంగా సిబ్బంది పనితీరు మెరుగుపరచాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా విడిసిలు ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు(బెల్ట్ షాపులు, కల్లు దుకాణాలు) అనుమతులు ఇవ్వకుండా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, అక్రమ వసూళ్లకు పాల్పడకుండా చూడాలన్నారు. పట్టణంలో ప్రత్యేకంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. రాత్రి సమయాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలి ముద్రలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీ సిహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సిఐలు భీమేష్, మొగిలి, రహీం పాషా, పాండేరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ సన్న బియ్యం అందాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అర్హత గల ప్రతి రేషన్ కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని పాడిబండ గ్రామంలో తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రతి లబ్ధిదారుడికి బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంతంలో గిరిజనులు అధికంగా ఉన్నందున సన్న బియ్యం పంపిణీ ద్వారా ఆరోగ్యంతో పాటు వ్యయ ప్రయాసలకు గురికావలసిన అవసరం లేదని, ప్రతి కార్డుదారుడికి ఉచితంగా సన్నబియ్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్డుదారులు చౌక ధరల దుకాణాల వద్ద క్రమ పద్ధతిలో వచ్చి సన్న బియ్యం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీడీ రామకృష్ణ, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ప్రత్యేక స్థలం కేటాయింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వీధి వ్యాపారులు రోడ్డుకు మధ్య, పక్కన వ్యాపారం చేయడంతో ట్రాఫిక సమస్య పెరుగుతుందని, అందుకే వారికి ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించడం జరిగిందని ఆర్డీఓ వినోద్ కుమార్ తెలిపారు. వీధి వ్యాపారులకు పాత గణేష్ థియేటర్ స్థలంలో వ్యాపారం చేసుకునేలా దుకాణాలను కేటాయించారు. దుకాణాల కేటాయింపుకు శుక్రవారం టీఎన్జీవోస్ భవనంలో లక్కీ డ్రా నిర్వహించారు. షాపుల నంబర్ల ప్రకారం లక్కీ డ్రా నిర్వహించి వారికి కేటాయించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వీధి వ్యాపారులు రోడ్లకు ఇరువైపుల, మధ్యలో వ్యాపారం చేయడంతో సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. దీన్ని గమనించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయిస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని పాత గణేష్ థియేటర్ స్థలంలో వీధి వ్యాపారులకు దుకాణాలను కేటాయించేందుకు లేఅవుట్ తయారు చేసి 201 దుకాణాలను ఏర్పాటు చేశారు. లక్కీడ్రా ద్వారా వ్యాపారులకు వాటిని కేటాయించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా వ్యాపారం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేలవారి సమావేశంలో భాగంగా ఆశా వర్కర్లకు



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, జాతీయ సికిల్ సెల్, ఎనీమియా ఎలిమినేషన్ మిషన్ గురించి వివరించారు. అనంతరం వేసవి కాలం నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సద్దాం, హెచ్ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్‌లు సంతోష్, స్వర్ణలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో శుక్రవారం కాలనీ మహిళలు, పురుషులు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండాకాలం వస్తే ప్రతి ఏడాది నీటి సమస్య ఏర్పడుతుందని అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రీతమ్‌ను సంప్రదించగా, మూడు రోజులుగా విద్యుత్ సమస్య ఉందని అందుకోసం నీటి సరఫరా కావడం లేదని చెప్పారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాకు కార్యదర్శికి ఆదేశించినట్లు పేర్కొన్నారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు కార్యదర్శి మోతిరాం బదులిచ్చారు.



మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్



నవతెలంగాణ-సారంగాపూర్

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలూరు గ్రామంలో డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కుష్ఠు లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎండాకాలం దృష్ట్యా వడదెబ్బ గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులను గుర్తించడానికి క్రమం తప్పకుండా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్త పోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి రోగాలను ముందుగానే గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామస్థాయిలోనే బీపీ, షుగర్ వంటి అసంక్రమిత వ్యాధులకు మందులు అందుబాటులో ఉంటున్నాయని, అవసరమైన వారికి ఎప్పటికప్పుడు మందులు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలతో పాటు రిజిస్టర్లు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్ఓ రాజేందర్‌తో పాటు జిల్లా మాస్ మీడియా అధికారి బారె రవీందర్, మహిళా ఆరోగ్య సహాయకురాలు నుస్రత్, ఆశా కార్యకర్తలు శ్యామల, రాజమణి, ప్రమీల ఉన్నారు.

సర్వే డాటా ఎంట్రీ డబ్బులు ఇవ్వాలి



నవతెలంగాణ-జైనథ్

సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేను ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రి చేసిన సీఎస్సీ ఆపరేటర్స్, ప్రయివేట్ ఆపరేటర్స్‌కు డబ్బులు ఇవ్వాలని శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ చేసి, నాలుగు నెలలు గడుస్తున్న డబ్బులు ఇంకా తమ ఖాతాల్లో జమ చేయలేదని అన్నారు. వెంటనే తమ రావాల్సిన డాటా ఎంట్రీ డబ్బులు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వి.లక్ష్మణ్, రాజేశ్వర్, అస్లాం, ఆశన్న ప్రశాంత్, ప్రసాద్ ఉన్నారు.

టీటీసీ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం అందిస్తున్న 42 రోజుల వేసవి శిక్షణ కోర్సు అయినటువంటి టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సునకు ఏప్రిల్ 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 42 రోజుల వేసవి టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సును రాష్ట్రంలోని గుర్తించబడిన ఐదు కేంద్రాలు హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, హనుమకొండ కేంద్రాల్లో మాత్రమే తేదీ 01 మే నుంచి 11 జూన్ 2025 వరకు నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కోర్సు చేయడానికి అభ్యర్థుల వయస్సు తేది 17 ఏప్రిల్ 2025 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. అదేవిధంగా ఈ శిక్షణ కోసం పదో తరగతి పాస్ అయిన వారు గాని లేదా ఎస్సిటిఈటి ద్వారా టీసీసీ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన వారు గానీ అర్హులని వెల్లడించారు. ఈ టీటీసీ 42 రోజుల కోర్సునకు దరఖాస్తు చేయు ఆసక్తి గల అభ్యర్థులు, దరఖాస్తు ఫారంను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.గావ్.ఇన్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను తేది 17 ఏప్రిల్ 2025 నుంచి 29 ఏప్రిల్ 2025లోపు గుర్తించబడిన ఐదు శిక్షణా కేంద్రాలలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాలలో సంప్రదించి, అందించాలని తెలియజేశారు.

రేపటి జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్టు ఏఎస్‌యూ జిల్లా కన్వీనర్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు-ప్రభుత్వ నిర్లక్ష్యం అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, తుడుందెబ్బ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సిడాం జంగుదేవ్, అశోక్‌లు పాల్గొంటున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటు, ఆదివాసుల విద్యాభివృద్ధి తదితర అంశాలపై సదస్సులో చర్చలు నిర్వహిస్తునామని తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతీ, యువకులు, ఆదివాసీ సంఘాల ప్రజాప్రతినిధులు, రాయి సెంటర్ సార్మెడీలు, పటేల్, దేవారీలు హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీఎంయూ రాష్ట్ర అధ్యక్షులు ఏఆర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ కార్మికుల జీవితాలను ప్రభుత్వాలు గాలికి వదిలేసిందని, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న ఆర్టీసీ కార్మికుల బతుకులు మారడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి ఉన్న అన్ని పథకాలు ఆర్టీసీ కార్మికునికి చెందేలా చేస్తామని హామీ ఇచ్చి మరిచారని తెలియజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర చాలా గొప్పదని ఆర్టీసీని తెలంగాణ ప్రభుత్వం ఈ సమాజం గుర్తిస్తుందని హామీలన్ని తుంగలో తొక్కారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం చొరవ చూపి పాత డీఏలు, ఏరియర్స్, 2017 పేస్కేల్‌కు సంబంధించిన ఏరియర్స్ 2021 కొత్త పీఆర్‌సీ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే అపాయింట్ డేట్ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కలిపించాలని, యాజమాన్యం చిన్న చిన్న తప్పిదాలకు పనిష్మెంట్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం కార్మికులకు ఇచ్చే డబ్బులు ఇవ్వకుండా, కార్మికుడు రూపాయి రూపాయి కూడబెట్టుకున్న పీఎఫ్, సీసీఎస్ డబ్బులు కాజేస్తుందని ప్రభుత్వం స్పందించి సీసీఎస్, పీఎఫ్ డబ్బులు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో గుత్తేదార్ల ఇష్టారాజ్యం

- సీసీ మీద సీసీ వేస్తున్న గుత్తేదారులు
- అధికారుల పర్యవేక్షణ లోపం



సీసీ రోడ్డుపై సీసీ రోడ్డు వేసిన గుత్తేదారు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం సీసీ రోడ్లను నిర్మిస్తోంది. కలకాలం నాణ్యతగా ఉండాల్సిన రోడ్లు ఇంజనీరింగ్ అధికారుల పర్యావేక్షణ లోపం, గుత్తేదారుల ధన దాహానికి నాసిరకంగా పనులు చేపడుతున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని 28 గ్రామపంచాయతీలకు 2024-25 సంవత్సరానికి గాను, రూ.2.90 కోట్లతో ఎంజీఎస్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరయ్యాయి. మార్చి ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పనులు చేయాల్సి ఉంది. ఇదే అదనుగా భావించిన గుత్తేదారులు హడావిడిగా పనులు చేసి నిబంధనలు గాలికి వదిలేశారు. కొన్ని పంచాయతీల్లో గతంలో వేసిన సీసీ మీద సీసీ వేసి చేతులు దులుపుకున్నారు. దీనికి క్యూరింగ్ నామమాత్రంగా చేయడంతో పాటు ప్రెస్సింగ్ చేయక పోవడంతో తొందర్లోనే సీసీ పగుళ్లు ఏర్పడే అవకాశముంది. మరోవైపు సీసీ రోడ్ల నిర్మాణంలో వెడల్పు, మందం 6 అంగుళాలు ఉండాల్సిన చోట నిబంధనలు ఎక్కడ కనిపించడం లేదు. గిన్నెర పంచాయతీలో సీసీ మీద సీసీ వేసిన ఆ శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం గమనార్హం. భిక్కుతాండ పంచాయతీల్లో చేపడుతున్న డ్రైనేజి పనుల్లో అడుగున సన్న కంకర వేయాల్సిన గుత్తేదారు అవేమీ పట్టించుకోవడం లేదు. సైడ్ వాల్ సైతం నాసిరకంగా నిర్మిస్తున్నట్టు ప్రజలు పేర్కొంటున్నారు. ఇలా నాసిరకం హడావిడిగా పనులు చేస్తూ, ఎంబీ రికార్డులు మాత్రం జోరుగా నమోదు చేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను ధృవీకరించాల్సిన క్యూసీ (క్వాలిటీ కంట్రోల్) అధికారులు సైతం మామూలుగానే తీసుకుంటున్నట్టు సమాచారం. పై పంచాయతీల్లోనే మార్చి లోపల పనులు పూర్తి చేయాల్సిన గుత్తేదారు ఏప్రిల్ నెలలో సైతం పనులు చేపడుతున్నాడు. ఏది ఏమైనా ఏజన్సీలోని మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాల కోసం నిర్మిస్తున్న నాసిరకం సీసీల నిర్మాణాలతో అది మూన్నాళ్ళ ముచ్చటగానే ఆగుపిస్తున్నాయి. అవి ఆనతి కాలంలోనే పగుళ్ల ఏర్పడి శిథిలావస్థకు చెరుకు కొని ప్రజాధనం వృధా అవుతుందని మండలవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ సీసీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పై విషయంపై ఆ శాఖ ఈఈ శివరాంను నవతెలంగాణ వివరణ కోరగా సీసీ రోడ్డు మీద గతంలో పాత రోడ్డు ఉందన్నారు. తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వారి బిల్లులను ఆపేస్తామన్నారు.

గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు



తమ గ్రామంలో గుత్తేదారు ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నాడు. పాత రోడ్డు మీదనే మరో సీసీ వేశాడు. తమ ఇంటి వరకు రోడ్డు వేసి వదిలేశాడు. దీంతో వర్షాకాలంలో తమ ఇంట్లోకి నీళ్ళు వచ్చే అవకాశముంది. గుత్తేదారులుకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించు కోవడం లేదు.

మెస్రం. సోమ్‌జీ, గిన్నెర



ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న మురుగు కాలువ

అటవీ, రెవెన్యూ భూవివాదాల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

అటవీ, రెవెన్యూ భూవివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ భూవివాదాల పరిష్కారంపై అధికారులతో ఆమె జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అటవీ, రెవెన్యూ శాఖల భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఎకరా భూమి విలువైనదని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులను తక్షణమే గుర్తించి, రెగ్యులర్ సర్వేలు నిర్వహించాలన్నారు. అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా సర్వే అధికారులు మ్యాప్ లను తయారు చేయాలని, అటవీ, రెవెన్యూ శాఖలలో ప్రజల భూ సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులతో ముడిపడి ఉన్న భూసమస్యలకు సంబంధించి కోర్టుల ఆదేశాల ప్రకారం అటవీ, రెవెన్యూ భూవివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు అనుమతి రావటం శుభ పరిణామం

- కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు భారత వాయు సేన అనుమతి ఇవ్వటం ఆదిలాబాద్ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలకు శుభపరిణామమని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేంద్ర మంత్రి జైరాం రమేష్ చొరవతో ఇక్కడ విమానాశ్రయ ఆశలు చిగురించాయని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో విమానాశ్రయం ఏర్పాటుకు ముందడుగు పడిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఒక్కడుగు కూడా ముందుకు సాగాలేదన్నారు. విమానాశ్రయం విషయంలో అప్పటి సీఎం కేసీఆర్, స్థానిక బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవటంతోనే ఆదిలాబాద్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. జిల్లాను అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని ఆరోపించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తెస్తానని ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించిన సీఎం కేంద్ర విమాన యాన శాఖతో సంప్రదింపులు జరిపి అనుమతులు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కానీ ఇక్కడి బీజేపీ నాయకులు తామే తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఎయిర్ పోర్టుకు అనుమతులు మీరే తీసుకు వస్తే, ఆదిలాబాద్‌లోని సీసీఐని కూడా తెరిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. సీసీఐని తెరిపిస్తే బీజేపీ నాయకులు అందరికీ పాలాభిషేకం చేస్తామని అన్నారు. ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎంకు ఆదిలాబాద్ జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సునీల్ జాదవ్, సోమరి నాగోరావు, విశాల్, గోవింద్, గోపీనాథ్, సంతోష్, అభిషేక్, వీర్షావ్, రాజవ్వ, సుమిత్ర, పార్వతి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-నార్నూర్

భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే అన్నారు. శుక్రవారం మండలంలోని మాలేపూర్ గ్రామంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామంలో పాదయాత్ర నిర్వహించి, ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అపహాస్యం చేస్తూ, బీజేపీ నాయకులు పార్లమెంట్‌లో మాట్లాడటం రాజ్యాంగాన్ని ఖుని చేసే ప్రయత్నమేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ దాదే అలీ, మహిళా నాయకురాలు ప్రణీత, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, రాథోడ్ దత్తారాం, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, విలాస్ ఆడే, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ నషీర్, మండల



ఉపాధ్యక్షులు మహమ్మద్, షేక్ దస్తగిరి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అవుట్ సోర్సింగ్ జేపీసీ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషాను అవుట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి స్కోచ్ అవార్డు అందుకున్న నేపథ్యంలో ముందుగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారానే వేతనాలు చెల్లించాలని కోరారు. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు ఇవ్వాలన్నారు. అలాగే హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలనీ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ జేఏసీ జిల్లా అధ్యక్షులు బండ శ్రీను, ప్రధాన కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లూరి రవి, దయానంద్, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ జేఏసీ ఉపాధ్యక్షులు రామగిరి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్ముల నరేష్, స్వామి, కోశాధికారి దువాస గోపాల్, సతీష్, సంఘర్ష్ రెడ్డి, తోట రాజు, ఆసిఫ్, శైలేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మళ్లీ కోరుకుంటున్న ప్రజలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులతో పాటు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మోసపూరిత బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ యువత స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపడం జరుగుతుందన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బేల మండలం బాది గ్రామానికి చెందిన సీడం నందు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఆదివాసులకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రహించి, గ్రామాలలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ హయాంలో ఆదివాసులకు అన్ని విధాల ప్రోత్సాహం లభించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రౌత్ మనోహర్, ప్రమోద్ కుమార్, గంభీర్, సతీష్ పవార్, తేజరావు, మధుకర్, అరుణ్ కొడప, వివేక్, తన్వీర్, పోతారెడ్డి, దయాకర్, భానుచందర్ పాల్గొన్నారు.

గతేడాది మూల్యంకనం పారితోషికం చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత సంవత్సరం 10వ తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయుల పారితోషికం చెల్లించుటకు తగు చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం డీఈఓను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మూల్యాంకనానికి సహయకులుగా ప్రతి పాఠశాల నుంచి 50 శాతానికి మించకుండా ఉపాధ్యాయులను మాత్రమే తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. విద్యార్థులకు ఏప్రిల్ 9 నుంచి వార్షిక పరీక్షలు ఉన్నందున ప్రతి పాఠశాల నుంచి కేవలం 50శాతం ఉపాధ్యాయులను 10వతరగల మూల్యాంకన సహాయకులుగా నియమించాలని కోరారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో 10వ తరగతి మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంబంధించిన పారితోషికం విడుదలకు ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు జాదవ్ బలరాం, జిల్లా కార్యదర్శి లింగారెడ్డి, జగన్, రామారావు, లచ్చారెడ్డి, పండరినాథ్, రాజారామ్, నాగన్న, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రపుల్ చందర్ రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఏడుగురు విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-తలమడుగు

గురుకుల పాఠశాలకు మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు గురుకుల పాఠశాల ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతమైన విద్యా బోధనలు అందిస్తున్నాయన్నారు. ఎపికైన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందన్, భానుతేజ, రిషిత, విగ్నేష్, కావేరి, స్నేహిత్, వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

డీఎండబ్ల్యూఓగా అబ్దుల్ నదీమ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మైనారిటీ శాఖ జిల్లా అధికారిగా అబ్దుల్ నదీమ్ ఖద్దూసిని నియమిస్తూ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం ఉద్యానవన శాఖ జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ నదీమ్‌కు మైనారిటీ శాఖను అదనపు బాధ్యతలుగా కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొనగా, ఇప్పటివరకు మైనారిటీ శాఖ విధులు నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవిని బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధికారి నదీమ్ మాట్లాడుతూ అదనంగా మైనారిటీ శాఖ ఇవ్వడం కొంత భారమైన జిల్లా ఉన్నతాధికారులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం



నవతెలంగాణ-కెరమెరి

పాదాచారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి గణేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం బయటకు వెళ్ళిన సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు చలి వేంద్రాలు ఉపయోగంగా ఉంటాయన్నారు. మండలంలో రద్దీ ఎక్కువగా ఉన్న చోట చలి వేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధి పని కోసం రోడ్డెక్కిన కూలీలు

- అంబేద్కర్ చౌక్ ఎదుట రాస్తారోకో
- డీఆర్డీఓ అధికారులకు వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆసిఫాబాద్, గొడవెల్లి, జనకాపూర్, హీరాపూర్, తారకరామనగర్‌కు చెంది 460 జాబ్ కార్డు కలిగిన 701 మంది తమకు ఉపాధి హామీ పని సౌకర్యం కల్పించాలంటూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్షురాలు గరిగెల పద్మ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో తాము ఉండడంతో తమ జాబ్ కార్డులకు పని కల్పించమంటూ అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో గత సెప్టెంబర్ నుండి పని లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి హామీ మీద ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సీఐ రవీందర్, ఎస్సై ప్రశాంత్ కూలీలకు నచ్చ చెప్పడంతో రాస్తారోకో విరమించి, ర్యాలీగా బయలుదేరి వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ వచ్చేవరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని తెలియజేయడంతో గ్రామీణ అభివృద్ధి అధికారులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. అనంతరం వారికి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఉపాధి హామీ కూలీల సంఘం ప్రధాన కార్యదర్శి కొడురుపాక పావని, ఉపాధ్యక్షురాలు బొమ్మకంటి స్వరూప, కోశాధికారి బోయిరే మంజుల, సహాయ కార్యదర్శి బామనే సుగుణ, కూలీలు పాల్గొనారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుండి జేత్వాన్ బుద్ధవిహార్ మీదుగా ఉపాధిహామీ పథకం నుండి దాదాపు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు దుర్గం ప్రశాంత్, జీవన్, భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రారంభించారు. రూ.ఐదు లక్షలతో నాలుగు సీసీ రోడ్లు మంజూరైనట్లు, జాతీయ రహదారి చిన్న వాంకిడి రోడ్డు జ్యోతిబాపులే సంక్షేమ భవనం, చుట్టుప్రక్కల రోడ్లను నిర్మించడానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, ఎమ్మెల్సీ దండే విఠల్ నిధులు చేశారని తెలిపారు. కార్యక్రమంలో భారతీ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు జైరాం, నాయకులు దుర్గం సదీప్, విజయ్, రోషన్, ప్రతాప్, దేవాజీ, పోచయ్య, మనోజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగ విరమణ పొందిన తమకు సంస్థ నుండి రావాల్సిన వివిధ రకాల ప్రయోజనాలు వచ్చేలా తమ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజశేఖర్‌ను మొట్టమొదటిసారి కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీకి ఎన్నో సంవత్సరాలు సేవ చేసి విరమణ పొందామన్నారు. ఆర్టీసీ నుండి రావాల్సిన మొత్తాలకు సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్దేశించిన సమయంలో వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మల్లేశం, రాష్ట్ర నాయకులు హజ్గర్, మహబూబ్, నారాయణ, జానీ, భీమ్రావు, దివాకర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యం

నవతెలంగాణ-జైనూర్

ప్రజాస్వామ్య రక్షణే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యమని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలో జంగాంలో ఆమె పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో సుగుణక్క ముఖ్య అతిథిగా పాల్గొని కలిసి జెండాను ఆవిష్కరించారు. నేడు దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబెద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, మండల అధ్యక్షుడు ముఖీద్, మాజీ సర్పంచులు, మాజీ వైఎస్ ఎంపీపీ, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు, కొట్నాక దౌలత్కా రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడో..?

- 15 నెలలుగా ఊసే ఎత్తని ప్రభుత్వం
- వృద్ధులు మరణిస్తేనే మరొకరికి పింఛన్
- వలస వెళ్లిన వారి గురించి ఆరా



నవతెలంగాణ-కెరమెరి

చేయూత పథకంపై ఆశలు పెంచుకున్న ఆశావహుల ఆశలు ఇప్పట్లో నెరవేరేలా కనబడడం లేదు. వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి ఆయా కుటుంబాల్లో పింఛన్ పొందుతున్న వృద్ధులు చనిపోతే, ఆ కుటుంబంలో అర్హత గల వారికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఇప్పటి వరకు మరణించిన వృద్ధుల వివరాలను సేకరించే పనిలో సెర్ప్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత, గీత కార్మికులు, తదితర వర్గాలకు చెందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ పథకాన్ని కొనసాగిస్తున్నాయి.

జిల్లాలో పింఛన్లు ఇలా..

జిల్లాలో వృద్ధాప్య 22924 మంది, వితంతు 21457, దివ్యాంగులు 5818, చేనేత 477, గీత కార్మికులు 134, బీడీ కార్మికులు 88, ఒంటరి మహిళలు 2,613, ఫైలేరియా బాధితులు 556, డయాలిస్ బాధితులు 33, ఒంటరి మహిళలు 2564 మంది మొత్తం 54051 మందికి పింఛన్లు ఇస్తున్నారు. ఈ పథకం కింద దివ్యాంగులకు నెలకు రూ.3,016, ఇతరులకు రూ. 2,016 ఇస్తున్నారు.

పదిహేను నెలలుగా కొత్త పింఛన్ల ఊసే లేదు..

తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఆ గ్యారంటీ పథకాల్లో ఒకటైన చేయూత పథకం కింద ఫింఛన్ల సొమ్మును డబుల్ చేయడంతో పాటు కొత్తగా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల ద్వారా ఆరు గ్యారంటీ పథకాల కింద ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. అందులో భాగంగా చేయూత పథకం కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. పదిహేను నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఉన్న పింఛన్‌దారుల్లో దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు, ఇతరులకు రూ.4 వేలు ఇస్తామన్న ప్రభుత్వం అమలు చేయలేదు. కొత్త పింఛన్ల కోసం అనేక మంది కాంగ్రెస్ నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 2022లో ఒకసారి మాత్రమే జిల్లాలో కొత్త వారికి పింఛన్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి కొత్త పింఛన్లు ఇచ్చిన దాఖలాలు కనబడడం లేదు. ఫింఛన్ల మంజూరు విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది ఒకే వైఖరిగా కనబడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.

వృద్ధులు మరణిస్తేనే మరొకరికి పింఛన్..

తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖాధికారులు వృద్ధాప్య పింఛన్‌దారులు మరణిస్తే, వారి కుటుంబంలో భార్యకు గానీ, భర్తకు గానీ లేదా అర్హులైన ఇతరులకు వెంటనే ఫించన్ మంజూరు చేయాలని ఆదేశించింది. దీంతో మరణించిన వృద్ధుల వివరాలు వారి కుటుంబంలో అర్హులైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పోస్టాఫీసుల ద్వారా పింఛన్లు పొందుతున్న వారిలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది మూడు మాసాలపాటు పింఛన్ తీసుకుని ఆ తర్వాత వలస వెళ్లారని గుర్తించారు. అందులో జిల్లాలో సైతం కొంత మంది ఉన్నారు. ఇందులో ఎవరైనా మరణించారా, ఏపీ ప్రాంతాలకు వలస వెళ్లారు, తిరిగి ఎప్పుడు వస్తారనే విషయమై ఆరా తీస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. మరణించిన వృద్ధుల కుటుంబాల్లో మరొకరికి అర్హులైన మంజూరు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఇప్పట్లో ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయడం, ఉన్న పింఛన్ దారులకు సొమ్ము పెంచే అవకాశాలు కనిపించడం లేదు.

పింఛన్ మంజూరు చేయాలి

వద్దూరి వెంకమ్మ, కెరమెరి



నా భర్త రెండేళ్ల క్రితం గుండె పోటుతో మరణించారు. ప్రజా పాలనలో పింఛన్ కోసం దరఖాస్తూ పెట్టుకున్నాను. కొత్త పింఛన్లు నేటికీ మంజూరు కాలేదు. నా లాంటి చాలా మంది పింఛన్ కోసం దరఖాస్తుచేసుకున్న మూడేళ్లుగా కొత్త పింఛన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

తిగోటే జయశ్రీ, కెరమెరి



మాది నిరుపేద కుటుంబం. నా భర్త బేల్దారీ పనులు చేసుకుంటూ ఉన్నంతలో నలుగురు పిల్లలను పోషించుకునే వాళ్ళం. నేను కూడా రోజు వారీ కూలీ పనులకు వెళ్లి భర్తకు చెదోడుగా ఉండేదాన్ని. రెండేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటివరకు మంజూరు కాలేదు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

ఐపీఎస్‌లకు ఆదర్శప్రాయంగా చిత్తరంజన్

- 67 మందిపై రౌడీ షీట్లు ఎత్తివేత
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఒకసారి పోలీస్‌స్టేషన్‌లో ఖైదీగా తమ పేరు నమోదైతే జీవితకాలం పాటు తమ చుట్టూ ఏం జరిగినా పోలీసులు పాత ఖైదీలను బైండోవర్ చేయడం పరిపాటి. ఆ సంస్కృతిని దూరం చేసే విధంగా పది సంవత్సరాలుగా ఎటువంటి కేసు నమోదు కాని పాత ఖైదీలపై ఉన్న రౌడీ షీట్లు ఎత్తివేస్తూ ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. మిగతా ఐపీఎస్‌లను ఆలోచనలో పడేసింది.

ఆసిఫాబాద్ డివిజన్‌లో పరిస్థితి

ఆసిఫాబాద్ డివిజన్‌లో ఉన్న ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, జైనూర్ సర్కిల్‌లలో ఉన్న పోలీస్ స్టేషన్లలో ప్రస్తుతం 277 అనుమానిత కేసులు, 106 రౌడీ షీట్లు కొనసాగుతున్నాయి. కేసుల ఎత్తివేత ఏ విధంగా ఉంటుందో నూతన కేసుల నమోదు కూడా అలాగే చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నూతనంగా 47 అనుమానిత కేసులు, 33 రౌడీ షీట్లు ఎస్డీపీఓ వచ్చిన తర్వాత చోటుచేసుకున్నాయి.



మాట్లాడుతున్న బాధితుడు

మొత్తం 67 కేసుల ఎత్తివేత

అసిఫాబాద్ డివిజన్ ఏఎస్పీగా చిత్తరంజన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత 368 హిస్టరీ షీట్లు ఉండగా వీటిలో 289 అనుమానిత కేసులు, 79 రౌడీషీట్లు ఉన్నాయి. పదేండ్ల నుండి ఎటువంటి గొడవల్లో తల దూర్చకుండా సత్ప్రవర్తన కలిగిన బాధితులను గుర్తించే విధంగా ఆయా పోలీస్ స్టేషన్ల హౌస్ ఆఫీసర్లకు ఎస్డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చిత్తరంజన్ తెలియజేయడంతో నేరం చేయని వారిని ఆయా స్టేషన్ల హౌస్ అధికారులు గుర్తించారు. దీంతో 59 మంది అనుమానిత కేసులు, 8 మంది మొత్తం 67మందిపై ఉన్న రౌడీ షీట్లను ఎత్తివేశారు.

హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

ఏఎస్పీ చిత్తరంజన్ తీసుకున్న నిర్ణయంపై ఖైదీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేయని తప్పులకు ఎన్నో సంవత్సరాల నుండి ఇబ్బందులు పడుతున్నామని కొత్తగా వచ్చిన యువ ఏఎస్పీ తమ బాధలు తెలుసుకొని తీర్చారని వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆనంద భాష్పాలతో తెలిపారు.

మారితే మద్దతు..నేరం చేస్తే శిక్షిస్తాం

చిత్తరంజన్, ఏఎస్పీ



అనుకోని పరిస్థితుల్లో తప్పు చేయడం మానవ సహజం. దానిని తెలుసుకుని మళ్లీ తప్పు చేయకుండా ఉన్న వ్యక్తి గొప్పవాడు. పది సంవత్సరాల నుండి ఎటువంటి తప్పు చేయకుండా ఉన్న వారిని గుర్తించి కేసులు ఎత్తివేయడం జరిగింది. మారిన మనిషికి ఏ విధంగానైతే మద్దతిస్తామో నేరం చేస్తే అదేవిధంగా చర్యలు తీసుకుంటాం.

కొత్త చరిత్రకు పునాది

బుద్దే స్వామి, రెబ్బెన సిఐ


కేసులను ఎత్తివేయడం అనేది ఒక గొప్ప చరిత్రకు పునాది లాంటిది. 10 సంవత్సరాల నుండి ఎటువంటి నేరాలు చేయకుండా జీవిస్తున్న వారిని గర్వంగా తిరిగేలా చేసిన ఏఎస్పీ చిరస్థాయిగా నిలిచిపోతారు.

పుష్కరకాల కష్టం తీర్చారు

రాజేష్, బాధితుడు

12 సంవత్సరాల నుండి తనపై నమోదైన కేసుతో ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు పెద్దవారయ్యారని వారి ముందు ప్రతిసారి పోలీసులు తీసుకువెళ్తే చిన్నతనంగా అనిపిస్తుందని నాతో అనడం నన్ను ఎంతగానో కుంగ తీసింది. యువ ఏఎస్పీ తీసుకున్న నిర్ణయంతో మా బాధలు తీరాయి. చట్టం ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటున్న ఇలా మానవత్వంగా వ్యవహరించడం జీవితంలో మర్చిపోలేను.

నాయకత్వ లక్షణాలుంటే రాణించగలరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతి ఒక్కరు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని అప్పుడే వృత్తిలో రాణించే అవకాశం ఉంటుందని రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ పరిశీలకులు స్టాలిన్ బాబు అన్నారు. జిల్లాలో ఉద్యోగోన్నతి పొందిన పీజీ హెచ్ఎంలు, ప్రైమరీ హెచ్ఎంలు, సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రధానోపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని పాఠశాలల అవసరాలకు తగిన విధంగా విజన్, మిషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా తరగతి గది పరిశీలన, ఉపాధ్యాయుల పనితీరును అంచనా వేసి, రివ్యూ నిర్వహిస్తూ బోధనాభ్యాసన ప్రక్రియలు సమర్థవంతంగా తరగతి గదిలో నిర్వహించే విధంగా చూడాలని, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సకాలంలో బేస్ లైన్, మిడ్ లైన్ మరియు ఎండ్ లైన్ వివరాలు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం బోధిస్తూ, పాఠ్యపుస్తకాలను సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు సత్యనారాయణ, అనురాధ భాయ్, ఎంఎల్ రాజు, శైలజ, లాలాజీ, రాజు పాల్గొన్నారు.

బుద్ధుని జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బుద్ధ భగవాన్ జయంతి ఉత్సవాలను తాలుకలో ఘనంగా నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం విక్రం తెలిపారు. శుక్రవారం మండలం కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో తాలూకా భారతీయ బౌద్ధమహసభ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి రమాబాయి అంబేద్కర్, డాక్టర్ భీంరావు అంబేద్కర్ 119వ పెండ్లి రోజును పురస్కరించుకొని చిత్రపటాలకు పూలమాలలు వేసి వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలోని మహా బోధి మహా విహార్ ఇతరుల నుండి బౌద్ధులకు అప్పగించాలనికోరుతూ మండల కేంద్రంలో భారీ ర్యాలీతో వెళ్లి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అంబేద్కర్, బుద్ధుని జయంతి ఉత్సవాలు విజయవంతం చేయడానికి తాలూకా ఉత్సవాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం విక్రమ్, ఉపాధ్యక్షులుగా దుర్గం జనార్ధన్, ఝాడి శివరాం, నవీన్ రాంటంకే, రాంటంకే తిరుపతి, దుర్గే రాజారం, దుర్గం సూరజ్, ఒంద్రే ప్రేమనందం, ప్రధాన కార్యదర్శిగా మానేపలి ప్రభాకర్, కోశాధికారిగా కొండగుర్లే హీరామన్, పిప్రే ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రత్న శ్రీకాంత్, బసరకార్ విశ్వనాథ్, నగ్రాడే రాజు, ఫూల్ ఝూలే నాందేవ్, దుర్గం తిరుపతి, తాక్‌సండే దేవిదాస్, దుర్గం తులసిరామ్ పాల్గొన్నారు.

పంపిణీలో సమస్యలు తలెత్తకుండా చూడాలి



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆర్డీఓ లోకేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యాన్ని సామాన్య ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఝరి రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలపై ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ వివరాలను పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదన్నారు. రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం ఉచితంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఆర్ఐ పవన్ నాయక్, నాయకులు సెండే నారాయణ్, కొట్రాంగే తిరుపతి, ఉత్తం నాయక్, జగన్నాథ్ రావు, కోవ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

స్పందించారు.. చెత్తను తొలగించారు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో గల ప్రాథమిక పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న చెత్తను తొలగించాలని నవ తెలంగాణలో "చెత్తను తొలగించరా" అని శుక్రవారం ప్రచురించిన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. శుక్రవారం సిబ్బందితో చెత్తను తొలగించి పరిశుభ్రం చేయించారు. దీంతో పాఠశాల పరిసర ప్రాంతాల శుభ్రం కావడం పట్ల కాలనీవాసులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు మున్సిపాలిటీ కమిషనర్, సానిటర్ ఇన్‌స్పెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.





4

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-నస్పూర్



మంచిర్యాల నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం ప్రీ ప్రైమరీ పిల్లలకి గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ మాళవి దేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైతన్యరావు మాట్లాడుతూ పిల్లలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ఇన్‌స్టిట్యూషన్ లక్ష్యమన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ కవిత మాదిశెట్టి అకాడమిక్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఇందులో వైస్ ప్రిన్సిపల్ స్రవంతి , రేష్మ, ఏవో సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ముత్తినేని మొండయ్య (42) జీవితం పై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యలు పాల్పడినట్లు ఎస్సై తహసీనుద్దీన్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భార్య పద్మ గత రెండు నెలల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన మొండయ్య గత నెల 29న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి మేనమామ రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



నవతెలంగాణ-మందమర్రి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై రాజశేఖర్ దళారులని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సారంగపల్లి గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలపై పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని కిరణ్మయి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు వాడడం వలన భూమి సారవంతం కోల్పోయి రానున్న పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పర్యావరణం పై ప్రభావం చూపే అవకాశం ఉందని, అధిక దిగుబడి వస్తుందని ఆశపడి ఏవిపడితే ఆ విత్తనాలను వాడకూడదన్నారు. వాడి నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం కూడా అందదన్నారు. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయానికి సంబంధించిన ఏ విత్తనాలు తీసుకున్నా తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు చెప్పే సూచనలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు లాభాలు గడించవచ్చన్నారు. గ్లైపోసెట్ నకిలీ విత్తనాలు వాడితే చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, వీటిని అమ్మడం, కొనడం చేయకూడదన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్ రెడ్డి, ఏఈఓ తిరుపతి, ఏఎస్ఐ మజీద్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మైనింగ్ సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఓపెన్‌కాస్ట్ గని అధికారుల్లో కొందరు మైనింగ్ సిబ్బందిపై కొనసాగిస్తున్న కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ సభ్యులు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఆవరణలో మాట్లాడిన ఆయన ఇక్కడి అండర్ మేనేజర్లలో కొంత మంది ఇబ్బంది కరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరెక్కడా లేనటువంటి విధంగా ఓవర్‌మెన్‌లను పని స్థలాల్లోకి కాలినడకకు వెళ్లి రావాలని కొంతమంది అండర్ మేనేజర్లు వారిని శారీరకంగా మానసికంగా వేదింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఓవర్‌మెన్‌లను మూడు నెలల్లో నాలుగేసి సార్లు షిఫ్టులు చేంజ్ చేయడం వల్ల మైనింగ్ సిబ్బంది విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా మానసికంగా కృంగిపోవల్సి వస్తోందన్నారు. గత మూడేండ్లకాలం నుంచి ఎంకే-4 మ్యాగ్జిన్ నుంచి ప్రత్యేక వాహనంలో పేలుడు పదార్థాలను జాగ్రత్తగా తీసుకొచ్చి వినియోగించే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు. ఈ విధంగా విధులు నిర్వర్తిస్తున్న ఓవర్‌మెన్‌లకు రెండు గంట ఓటీ ఇవ్వగా ప్రస్తుతం దీనికి విరుద్ధంగా మరో ఇద్దరు ఓవర్‌మెన్‌లను నియమించడం సరికాదని అన్నారు. షేడేలు, పీహెచ్‌డీలు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వాలని హెచ్ఎంఎస్ సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తుందని, మైనింగ్ సిబ్బందిని వేధించడం వెంటనే మానుకోవాలని హెచ్ఎంఎస్ డిమాండ్ చేస్తోందన్నారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పొలిటికల్ సైన్స్ విద్యార్థులకు శుక్రవారం భారత రాజ్యాంగ నూతన చట్టాలపై స్థానిక సివిల్ కోర్టు లీగల్‌హెడ్ చేను రవికుమార్ అవగాహన కల్పించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశంలో మారిన నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నూతన చట్టాల గురించి పలు ప్రశ్న అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు సన్మానించారు. ఇందులో ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, , వైస్ ప్రిన్సిపల్‌య తిరుపతి, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకురాలు సమ్మక్క, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం



నవతెలంగాణ-నస్పూర్

టింబర్ యార్డ్ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో టింబర్‌యార్డ్ కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టింబర్ యార్డ్ కార్మికులు 30 ఏండ్లుగా వేతన నష్టానికి గురవుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని రెండేండ్లుగా అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే టింబర్ యార్డ్ కార్మికులకు సర్వీసు, సీఎంపీఎఫ్, పెన్షన్, ప్రస్తుతం పొందుతున్న జీతాల విషయంలో పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. ఇందులో హెచ్ఎంఎస్ సెంట్రల్ నాయకులు తిప్పారపు సారయ్య, వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, సహాయ కార్యదర్శి నోముల బాలయ్య, ఆర్జీ1 బ్రాంచ్‌కార్యదర్శి క్రాంతికుమార్, టింబర్‌యార్డ్ కార్మికులు పాల్గొన్నారు.

హామీల అమలలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య
- గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



దండేపల్లి : చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-దండేపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ఆరోపించారు. మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారంకై శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చాకలి ఐలమ్మ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గత 15 రోజులుగా సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇల్లు జాడేలేదని ఆరు గ్యారంటీల అమలుకు దిక్కు లేదన్నారు. మహిళలకు ఆర్థిక సాయం ఊసే లేదని ఎద్దేవ చేశారు. గ్రామాలలో పారిశుధ్యం పూర్తిగా లోపించి దోమలు పెరిగి గ్రామీణ ప్రజలు వ్యాధుల పాలవుతున్నారన్నారు. అయినా అధికారులు జీతాలు తీసుకుంటున్నారు తప్ప స్థానికంగా ఉంటూ పనిచేయడం లేదని ఆరోపించారు. వేసవిదృష్ట్యా గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇంకా ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై గొంతు విప్పిన ప్రజలపై తీవ్రమైన నిర్బంధాలు కొనసాగిస్తున్న ప్రభుత్వం ఇటువంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యవర్గ సభ్యులు కనికరపు అశోక్, దుంపల రంజిత్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే అబ్దుల్లా, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉమా రాణి, ఐద్వా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిడా సమ్మక్క, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొండగుర్ల లింగన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంబటి లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు రమాదేవి, ఆయా గ్రామాల ప్రజలు, గిరిజనలు పాల్గొన్నారు.

జైపూర్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకే రవి అన్నారు. శుక్రవారం చెన్నూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుకై సీపీఐ(ఎం) పోరుబాట చేపట్టిందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఈనెల 15, 16, 17 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట, 21న మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేపట్టాలని పార్టీ పిలుపు నిచ్చిందన్నారు. మూడోమారు అధికారంలో వచ్చిన బీజేపీ ఉపాధి హామీ పథకం కూలీల పొట్టలు కొట్టడడం కోసం నిధులు తగ్గించిందని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపునిచ్చిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో బొడెంకి చందు, కనికరపు అశోక్, ఉమారాణి, కొండగొర్ల లింగన్న, దుంపల రంజిత్ కుమార్, సమ్మక్క, రమాదేవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



జైపూర్ : చెన్నూర్‌లో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

టోకెన్ సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య

నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన ఒక్క రోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐకే1ఏ గనిగేట్ మీటింగ్‌లో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ప్రస్తుత బీజేపీ రద్దు చేసి 4 కోడ్‌లుగా మార్చి ఏప్రిల్ నుంచి అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా సింగరేణిలో కూడా దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. దేశానికి ఆదాయం అనుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటువరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని తెలిపారు. ఫలితంగా దేశ ప్రజలకు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్టలలో బొగ్గుతీసే పనిని కాంట్రాక్టర్లకు ఇవ్వద్దని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లందు, కోయగూడెం ఓసీపీని సత్తుపల్లి ఓసీపీలను ప్రైవేటు వారికి ఇచ్చిందని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటిని సింగరేణికే ఇవ్వాలని తాడిచర్ల 2, భూపాలపల్లి, వెంకటాపూర్ 2 గనులను వేలం వేయకుండా సింగరేణి ఇవ్వాలని అన్నారు. మణుగూరు ఓసీటును ఎక్స్‌టెన్షన్ చేయాలని, గోలేటి 1, మాదారం 1 గనులు ప్రారంభించాలని, సింగరేణి యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశంలో అంగీకరించిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం గుర్తింపు సంఘంతో పాటు అన్ని కార్మిక సంఘాలు అన్ని కలిసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20 న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి రాజేశ్వర్ రావు, ఫిట్ కార్యదర్శులు నవీన్ రెడ్డి, అగ్గు శ్రీకాంత్, మైనింగ్ స్టాఫ్ బ్రాంచ్ కార్యదర్శి బాలకష్ణ ,అడ్డు శ్రీనివాస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్,ఫిట్ ఉపాధ్యక్షులు పెద్దన్న, సత్తయ్య వెంకటేష్, రమేష్, శెట్టి శంకరయ్య పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

సమ్మె చేస్తున్న కార్మికులకు ఏఐటీయూసీ మద్దతు

ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఓబీ వోల్వో డ్రైవర్లు చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతోందని, వారి సమస్య పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గత వారం రోజులుగా జీత భత్యాల చెల్లింపు తదితర సమస్యల పరిష్కారం కోసం సమ్మె కొనసాగిస్తున్న కాంట్రాక్టు కార్మికులను శుక్రవారం ఆయన కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఓవర్ బర్డెన్ కాంట్రాక్టు చేపట్టిన వరాహ కంపెనీ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న తీరుపై పలు దఫాలుగా విజ్ఞప్తులు చేసిన వరాహ కంపెనీ పట్టించుకోకపోవడంతో కార్మికులు సమ్మె చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారంలో వరాహ కంపెనీ నిర్లక్ష్యం చేస్తుండగా హక్కుల సాధన కోసం కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితులను కంపెనీ తీసుకొచ్చిందని అన్నారు. కార్మికుల సమ్మెకు మద్దతు ఉంటుందన్నారు. ఇందులో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శులు నవీన్ రెడ్డి, అగ్గు శ్రీకాంత్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్



ఇందిరమ్మ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తాండూర్

మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాల్‌నగర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభివృద్ధికి చేయూతనందిస్తోందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరున మంజూరివ్వడం జరుగుతుందన్నారు. పేదింటి ఆడపిల్ల పెండ్లికి వివాహ కానుకగా కల్యాణలక్ష్మి పథకంతో ఆర్థికసాయం చేస్తుందన్నారు. కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఉపాధి హామీ నిధులను వినియోగించడం జరిగిందని, సబ్సిడీ గ్యాస్ , ఫ్రీ బస్సు సౌకర్యం మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలేనని గుర్తు చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా సబ్సిడీ రుణాలను అందిస్తోందన్నారు. అనంతరం 69 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు, భూమిపూజ చేసి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఇందులో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ పద్మజ, ఎజాజొద్దీన్, ఎంపీఓ అనిల్, కాంగ్రెస్ నాయకులు మురళీధర్‌రావు, రవీందర్, ఈసా, జుబేర్, శంకర్ , తిరుపతి, బండి పోశం, ద్వారక తిరుపతి, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

- 9 మంది అరెస్టు, రూ. 62 వేలు, 9 ఫోన్‌లు స్వాధీనం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయం సమాచారం మేరకు ఎస్సై రాజవర్ధన్, సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకుని, వారి నుంచి రూ.62 వేల నగదు, 9 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో గుంజి వెంకటేష్, కొంపల్లి నర్సయ్య, బందెల శంకర్, కష్ణ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములు, రాజేశం, పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్, జక్కుల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ యాసీన్ ఉన్నారు. నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సీనియార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పదవీ విరమణ పొందిన మంచిర్యాల డీసీఈబీ సెక్రెటరీ స్థానంలో చేపట్టనున్న నియామకంలో సీనియార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల (యూఎస్‌పీసీ) జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. డీసీఈబీలోని సభ్యుల కాలపరిమితి అయిపోయినందున అసిస్టెంట్ సెక్రెటరీ ఆదేవిధంగా డీఎస్ఓ, డీఈఓ కార్యాలయ టీచింగ్ స్టాఫ్‌ను సొంత కార్యాలయాలకు పంపించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందులో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చక్రపాణి, రాజవేణు, డీటీఎఫ్ నాయకుడు రమేష్, జయకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సన్నబియ్యం అందించాలి



నవతెలంగాణ-నస్పూర్

నిరుపేద కుటుంబాల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ అర్హులందరికీ అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సన్నబియ్యం పంపిణీ, రేషన్‌కార్డులు, ప్రజల స్పందన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా వివరాలుతు అడిగి తెలుసుకుని, తగు సూచనలు, సలహాలు అందించారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ, వివిధ అధికారులు పాల్గొన్నారు.

జన్నారం : తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం అందించడం జరుగుతుందని మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ముసాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రదీప్, బండారి స్వామి, రవి పద్మారావు చిన్నన్న పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు



నవతెలంగాణ-జన్నారం

ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల్లో మండలంలోని రేండ్లగూడ ఎంపీయూపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, మండలంలోని కలమడుగు వివేకానంద ఆంగ్లమ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. రేండ్లగూడ ఎంపీ యూపీఎస్ పాఠశాలకు చెందిన 7 విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి విజయకుమార్ తెలిపారు అలాగే కలమడుగు వివేకానంద ఆంగ్లము పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ అమరగొండ సతీష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, పాఠశాల హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు విమల, సుజాత ,శ్రీలత, మంజుల, సరోజ, రోజ అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బెజ్జూర్



సన్న బియ్యం పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోపరుచుకోవాలని కోరారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు భూష శంకర్, నాయకులు పాల్గొన్నారు.

9మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జడ్పీక్వార్టర్స్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 9 మంది పేకాట ఆడుతూ పట్టుపడ్డారని తెలియజేశారు. వీరి వద్ద నుండి రూ.39,600 నగదు, పేకాట ముక్కలు,7 బైకులు, 9 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాట ఆడిన వారిలో కుందావార్ రాజేష్, దేగావత్ అశోక్, నల్లూరి దామోదర్, టి సునీల్ గౌడ్, బెజ్జంకి అనిల్, కె.గజానన్, తోట శ్రీనివాస్, సిగ్గం రాజేష్, ఆకుల భూమయ్య ఉన్నారని వెల్లడించారు.

అనర్హులకు అందలం..!

- మైనార్టీశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకతవకలు
- ఉన్నతాధికారులకు తెలిసినా ఏమీ చేయలేని వైనం
- సహచట్టంతో వెలుగులోకి అక్రమాలు



సమీకృత కలెక్టరేట్‌లోని మైనార్టీ శాఖ కార్యాలయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆవిర్భావం నాటి నుండి ఏదో ఒక విధంగా నిరంతరం వార్తల్లో ఉండే ఏకైక శాఖ మైనారిటీ సంక్షేమ శాఖ. విద్యార్థులకు పెట్టే తిండి దగ్గర నుండి ఉద్యోగుల నియామకాల వరకు అంతా కొంతమంది చేతుల్లోనే నడుస్తోంది. కొంతకాలం క్రితం వరకు హెడ్ ఆఫీస్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ వ్యక్తి అన్ని పనులు చక్కపెట్టేవాడు. సదరు వ్యక్తి వెళ్లిపోయిన పరిస్థితిలో మాత్రం మార్పు రాకపోవడం విడ్డూరంగా ఉంది. అయితే ఇదే విషయంపై మైనారిటీ సంక్షేమ శాఖ అధికారినిని ఫోన్‌లో సంప్రదించడానికి పలుసార్లు ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది.

మైనారిటీ శాఖ లీలలు

మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న నాలుగు విద్యాసంస్థల్లో వివిధ రకాల 16 పోస్టులకు డిసెంబర్ 9న నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిలో భాగంగా కాగజ్‌నగర్ బాలుర కళాశాలలో జూనియర్ లెక్చరర్ సీజీఏ పోస్టుకు 8 మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు అనర్హులుగా ప్రకటించడంతో పాటు ఐదుగురిని తుది డెమోకు ఎంపిక చేశారు. అయితే చివరికి అనర్హునిగా ప్రకటించిన వ్యక్తిని ఎంపిక చేసి ఆయన పేరు మీద ఉత్తర్వులు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

అనర్హులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు..?

నిరుద్యోగులు ఎంతోమంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో మైనారిటీ శాఖలో అధికారుల ఇష్ట రాజ్యం కొనసాగుతోంది. తాజాగా జరుగుతున్న నియామకాల్లో అనర్హుడైన వ్యక్తికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అర్హత లేని వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారడంతో పాటు అర్హత గల వ్యక్తికి అన్యాయం జరుగుతుంది. అయితే అనర్హునిగా ప్రకటించిన వ్యక్తి ప్రస్తుతం బోధనా అనుభవం సర్టిఫికెట్ సంపాదించినట్లు తెలుస్తోంది. అధికారులు దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితునికి న్యాయం చేయాలి.

ఉన్నతాధికారులకు కూడా ఏమీ తెలియని వైనం!

ఒక శాఖలో ఏం జరుగుతుందనేది జిల్లా స్థాయి అధికారికి తెలియాలి. కానీ జిల్లాలోని మైనార్టీ శాఖ మాత్రం దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. డిసెంబర్‌లో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా భర్తీ ప్రక్రియకు సంబంధించి స్క్రుటినైజేషన్ జిల్లాలో జరగగా ఎంపిక ప్రక్రియ మాత్రం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

స.హ. చట్టంతో వెలుగులోకి..

అక్రమాలకు అలవాటు పడ్డ మైనారిటీ శాఖ అధికారులు మరో అక్రమం చేయడానికి ప్రయత్నాలు చేయగా బాధితుడు సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారం ద్వారా అక్రమం వెలుగులోకి వచ్చింది. ఇచ్చిన సంవత్సరంలో 8 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఐదుగురిని తుది డెమోకు ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొనడంతో బాధితుడు జిల్లా అధికారుల కార్యాలయాల చుట్టూ న్యాయం కోసం తిరుగుతున్నాడు.

కోర్టుకు వెళ్లడానికైనా సిద్ధం

అరుణ్, బాధిత అభ్యర్థి



అధికారులు పెట్టిన ప్రతి పరీక్షలో మొదటి స్థానంలో ఉన్నాను. అయిన తనను కాదని మరొకరిని ఎంపిక చేస్తున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే సమాచారాన్ని తీసుకెళ్లి కోర్టు ద్వారా న్యాయం జరిగేలా పోరాటం చేస్తాను. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాను. ఉద్యోగం వచ్చే వరకు పోరాటం చేస్తునే ఉంటా.

డీఈఓను కలిసిన ఉపాధ్యాయ సంఘాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టిన రేణుగు శ్రీనివాస్ రెడ్డిని టీయూటీఎఫ్ సభ్యులు కలిశారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి పరిచయం చేసుకొని శాలువతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు జాదవ్ బలరాం, జిల్లా కార్యదర్శి లింగారెడ్డి, జగన్, రామారావు, లచ్చారెడ్డి, పండరినాథ్, రాజారామ్, నాగన్న, రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన డీఈఓ ను కలిసిన పీఆర్టీయు జిల్లా శాఖ

జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస రెడ్డిని పీఆర్టీయూ తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్చం అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం డైరీని అందజేసి పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కనక అభిమాన్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి బాబన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జిల్లా కోశాధికారి ముజీబ్ పాల్గొన్నారు.



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మాదకద్రవ్యాల నివారణకు కఠినంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాదకద్రవ్యాల అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత భవిష్యత్తుపై చెడు ప్రభావం చూపే మాదకద్రవ్యాల రవాణా, వాటి పూర్తిస్థాయి నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశించారు. శుక్రవారం అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలపై దుష్ప్రభావాలను చూపే మాదకద్రవ్యాల రవాణపై జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సమిష్టిగా కృషి చేసి ఆసిఫాబాద్ జిల్లాను నషా ముక్త్ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. డ్రగ్స్, గంజాయి సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, మాదకద్రవ్యాల మత్తులో అనేక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. యువత చెడుదారులలో వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలపై పెంచుకున్న నమ్మకాన్ని కోల్పోతున్నారని అన్నారు. గంజాయి పండించడం, రవాణా చేయడం, విక్రయించడం, సేవించడం వంటి వాటిపై ఉక్కు పాదం మోపాలని, ముఖ్యంగా రాత్రి సమయాలలో యువత గుంపుగా ఉన్న ప్రాంతాలపై నిఘా పెంచాలన్నారు. రైల్వే, బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులు, మందుల దుకాణాలలో తనిఖీలు చేపట్టాలని, సరిహద్దు రాష్ట్రం నుండి అక్రమంగా జిల్లాలో రవాణా చేసే అవకాశం ఉన్నందున చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వసతి గృహాలు, కళాశాలలు, గురుకుల విద్యార్థులకు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సోషల్ మీడియా, వివిధ ప్రచార, ప్రసార సాధనాల ద్వారా నషా ముక్త్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ఆర్థిక స్థితి, కుటుంబ పరిస్థితి, వయసు, ఆరోగ్యం వంటి అంశాలపై చూపే చెడు ప్రభావం కారణంగా వ్యక్తి జీవితాన్ని కోల్పోతాడన్నారు. జిల్లాలో డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో డిపిఓ భిక్షపతి, డిడబ్ల్యూఓ భాస్కర్, డిటిడిఓ రమాదేవి, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, డీఎంహెచ్ఓ తుకారాం పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి వర్షపు నీటిబొట్టును వృథా చేయకుండా పొదుపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని చిర్రకుంట వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని పాడిబండ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వాటర్ షెడ్ ప్రత్యేక అధికారి ప్రకాష్, డీఆర్డీఓ దత్తారావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రకృతిని కాపాడుతూ భవిష్యత్తు తరాలకి సహజ వాయువుతో పాటు నీటిని అందించాలన్నారు. వాటర్ షెడ్ ఆధ్వర్యంలో వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, ఫారం పాండ్‌ల ద్వారా పొదుపు చేసేందుకు నిర్మాణ పనులు చేపట్టాలని, ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించి వారిని కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని తెలిపారు. అంతకుముందు గ్రామంలో వాటర్ షెడ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీఓ శ్రీనివాస్, వాటర్ షెడ్ అధికారి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించని పక్షంలో ఆందోళన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధి హామీ కూలీలకు గతేడాది పనికి సంబంధించిన కూలీ డబ్బులను చెల్లించని పక్షంలో ఆందోళన చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వల్లకొండ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీ డబ్బులు చెల్లించడంలో పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, సక్రమంగా డబ్బులు ఇవ్వడం లేదని కూలీలు ఆయనకు వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని అన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఎంపికైన ఆసిఫాబాద్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్‌తో పాటు కమిటీ సభ్యులను ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారీక్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు చంద్రకుమార్, చరణ్ తేజ, రామకృష్ణ, నగేష్, లాల్ షా, మధురిమ, కిషోర్, కుమార్, రాజీవ్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు వినేష్, అబ్దుల్లా, రమణారెడ్డి, పుల్లూరు శంకర్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన లే అవుట్ లేని భూముల క్రమబద్దీకరణ ప్రక్రియలో భాగంగా ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ లేని భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్-2020 ద్వారా అవకాశం కల్పించిందని, ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి అర్హులైన వారి నుండి రుసుము వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపుకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఈ విషయం లబ్ధిదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ భిక్షపతి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీమహంకాళీ దేవస్థానంలో అమ్మవారిని జిల్లా న్యాయమూర్తి యువజార్ దర్శించి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్ స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు కావుడే సంతోష్, కమ్మరి మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని రెబ్బన గ్రామ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రెబ్బెన రైతులు కోరారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 12 మంది రైతులు రోడ్డు వెడల్పులో భాగంగా భూములు కోల్పోతున్నారని, రోడ్డు వల్ల తాను భూములు కోల్పోవాల్సి వస్తుందని భూములపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని తమ నాదుకోవాలని, ప్రభుత్వంనష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

9 నుండి వార్షిక పరీక్షలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదివే విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 9 నుండి 17 వరకు వార్షిక పరీక్షలుంటాయని మండల విద్యాధికారి వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు 9 నుండి 11 వరకు ఉదయం 9 గంటల నుండి 11:45 నిమిషాల వరకు, ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు 9 నుండి 17వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించినట్లు, విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు.

పేదోడి కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-రెబ్బెన

పేద ప్రజల కడుపు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రత్నం ఆనంద్ అన్నారు. శుక్రవారం నంబాల గ్రామంలోనిరేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పందేడ్లలో బీఆర్ఎస్ ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డు అందిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం నిషేధించిన వస్తువులను అక్రమంగా రవాణ, కల్తీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కమలాకర్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ ఎదుట గతంలో చేసిన కల్తీ, నకిలీ విత్తనాల కేసులో పారిగాం గ్రామానికి చెందిన ఉల్కే మోతిరం, భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్‌లను తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు, నకిలీ విత్తనాలు, నకిలీ గడ్డి మందులు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శంకర్‌తండ గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామస్తులు ఎండ కాలం వచ్చిందంటే తాగునీటి సమస్య ఉంటుందన్నారు. ఉన్న ఒక్క చేతి పంపు నుంచి నీరు రావడం లేదని, అధికారులు తమకు వెంటనే తాగునీటీ సమస్యను పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ నీరు ఒక్క రోజు వస్తే రెండు రోజులు రావడం లేదన్నారు. తాగడానికి భగీరథ నీరును వాడలేమన్నారు. మురుగు నీరు వస్తుందని, ఎండ కాలం నేపథ్యంలో అధికారులు, ఐటీడీ ఏపీఓ, కలెక్టర్ తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

సమిష్టి కృషితోనే లక్ష్యసాధన



నవతెలంగాణ-రెబ్బెన

సమిష్టి కృషితోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 100శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖైర్‌గూడ ఉపరితల గనిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో భాగంగా మార్చి నెలలో 100శాతం ఉత్పత్తి సాధించి స్పెషల్ ఇన్‌సెంటివ్ స్కీంలో అర్హత సాధించినందుకు కార్మికులందరికీ మిఠాయి పంపిణీ చేశారు. అదేవిధంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తు గొడుగులు, తెల్లటి రుమాలను అందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ఎం నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ బి.వీరన్న, మేనేజర్ జె శంకర్, సేఫ్టీ ఆఫీసర్ ఏ నారాయణ, డివైపిఎం వేణు, సంక్షేమ అధికారి రజిని కుమార్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, నాయకులు శేషు మీస చంద్రశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

20న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 20న జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోషియేషన్ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వాహకులు ధీరజ్ భౌమిక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ నెల 19న మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సమిరన్ రేణుక ఆసుపత్రిలో నామినేషన్ల స్వీకరణ, 20న స్థానిక వాసవి గార్డెన్‌లో ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించబడుతాయని ఆయన వివరించారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కౌంటింగ్ చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో జగ్జీవన్ రామ్ జయంతి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జయంతి వేడుకలకు జిల్లాలోని అధికారులు, కుల సంఘాల ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు పరికరాల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం స్థానిక డివిజనల్ రిసోర్స్ సెంటర్‌లో పరికరాలను పంపిణీ చేశారు. అలింకో మరియు తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు రోలేటర్, వినికిడి యంత్రాలను ఎంఈఓ వాసాల ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు జె సతీష్, ఎం స్వరూప, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్జీవన్ జయంతిపై ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే భారత దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావు 118వ జయంతి వేడుకలపై ఎమ్మార్పీఎస్ నాయకులు మండలంలోని అంకుసాపూర్, బాబాపూర్, చిరకుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మాట్లాడుతూ నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున మాదిగలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, సురేష్, రజిత, ప్రమీల, కల్పన, మహేష్ పాల్గొన్నారు.

ప్రాపర్టీ టాక్స్‌పై 5శాతం పన్ను తగ్గింపు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ఈనెల 30 వరకు 2025-26కు సంబంధించిన ఒరిజినల్ ప్రాపర్టీ టాక్స్‌పై 5శాతం పన్ను తగ్గిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీడీఎంఏ ఉత్తర్వుల మేరకు పన్ను చెల్లింపులో 5శాతం తగ్గించనున్నట్లు, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రాపర్టీ పనులు చెల్లించాలని సూచించారు.

డీఏ బకాయిల విడుదల చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఐదు డీఏలు బకాయి ఉన్నందున వెంటనే వాటిని చెల్లించాలని పేర్కొన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయి ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని కోరారు.

ఢిల్లీలో దీక్షకు ఆదిలాబాద్ వామపక్షాల మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఆవరణలో బత్తుల సిద్దేశ్వర్ పటేల్ జక్కని సంజయ్ కుమార్‌లు దేశ వ్యాప్తంగా వెంటనే బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ, ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి ఆదిలాబాద్ వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. దీక్షలో కూర్చొని బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట్ నారాయణ, నాయకుడు భామన్ జగన్, అంబేద్కర్ సంఘాల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, రైతు నాయకులు కొండా రమేష్, ఈశ్వర్ దాస్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

భిన్న భాషలు, సంస్కృతులతో జాతీయత స్ఫురిస్తోంది

నవతెలంగాణ-జైపూర్



దేశ ప్రజలు విభిన్న భాషలు, సంస్కృతులు కలిగి ఉండి భిన్నత్వంలో ఏకత్వం అను జాతీయతను చాటుతున్నారని టేకుమట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి తెలిపారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కళా ప్రదర్శనలు ఆహుతులను ఆకర్షించాయి. కాగా పాఠశాలలో ప్రతి ఉదయం ప్రార్థన సమయంలో పాఠశాల విద్యార్థులకు హర్యానా భాష నేర్పిస్తున్నట్లు తెలిపారు. భిన్న సంస్కృతులు, భాషలు కలిగి ఉన్నా మనదేశ ప్రజలు ఐక్యతను ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారి భాష, ఆచారాలు, అలవాట్లు, కట్టుబొట్టు, సాంప్రదాయ వేషాధారణలో విద్యార్థులు నాట్య ప్రదర్శనలు ఆకర్శనగా నిలిచాయి. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గుడిరేవు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాళ్లపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి క్రాంతికిరణ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని వార్షిక పరీక్షలలో బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు మల్లూరు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కర్నె నరేందర్, శ్రీనివాస్, అనిత, సల్మా, లచ్చన్న, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

నస్‌పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎన్నుకున్నారు. గౌరవ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. నస్పూర్-శ్రీరాంపూర్ గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్ల రాజేశం (నమస్తే తెలంగాణా), అధ్యక్షుడిగా భూపతి రవి (సాక్షి), ప్రధాన కార్యదర్శిగా కోండ శ్రీనివాస్ (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా మైదం రామకష్ణ (మన తెలంగాణా), సీపతి రాములు (వెలుగు), సంయుక్త కార్యదర్శిగా వేల్పుల మల్లేషం(తెలుగుప్రభ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా క్యాతం రాజేశ్ (నేటివార్త), ఫైనాన్స్ మేనేజర్ నారాయణరెడ్డి (ఆంధ్రజ్యోతి), కార్యవర్గ సభ్యుడిగా తలారి సమ్మయ్య(నవతెలంగాణా), క్రమశిక్షణా సంఘం కన్వీనర్ కోడం రవికుమార్ ఎన్నికయ్యారు.

ఆదివాసీ గ్రామాల్లో సాత్ రేయ్యాల్ పండుగ

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని చిన్న సాకడ, మోడీ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆదివాసులు సాత్ రేయ్యాల్ పండుగను నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరి బయట వెళ్లి నైవేద్యం తయారు చేసి దేవతలకు సమర్పించి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. చైత్ర మాసంలో అమావాస్య నుంచి గ్రామంలో ఉన్న ఆరాధించే పోచమ్మ, భీమ్మల్ పెన్, అవ్వల్ పెన్, బుయ్ లచ్మి, దేవతలకు ఐదు రోజుల పాటు నీటితో శుద్ధి చేసిన తర్వాతి రోజు ఈ పండుగ నిర్వహించడం అనవయితీగా వస్తుంది.

శిక్షణను సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయుల ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలక్ మందిర్‌లో కొనసాగుతోంది. అలాగే పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్-1లో కొనసాగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు తమ శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందజేయాలని కోరారు. అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, కంప్యూటర్ ద్వారా విద్యా బోధన చేస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రణదీవెనగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రణదీవె నగర్‌లను డీఈఓ సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌గౌడ్, కార్యాలయ సీసీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి ఎం.మల్లారెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ హజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వారం రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6న ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని బూత్‌లలో బీజేపీ జెండాలు ఎగురవేయాలని, 8, 9 తేదీల్లో క్రియాశీల కార్యకర్తల సమ్మేళనాలు 10, 11, 12 తేదీల్లో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే అటల్ జీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పించాలని కోరారు. వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ, జన జాగరణ, వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, రైతు సమస్యలపై ఎప్పటికప్పుడు అన్నదాతల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ బీజేపీ జిల్లా నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, ఆకుల శ్రీనివాస్, ఒడ్నాల రమేష్, ఒడిసెల అర్జున్, ఆకుల కార్తీక్, కార్యక్రమ ఇన్‌చార్జులు అమరవేణి రవీందర్‌గౌడ్, అర్జున్ సింగ్ ఠాకూర్, సుమన్, జిల్లాలోని అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

నూతనంగా ఉట్నూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బానోత్ జైవంత్ రావును శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో బజార్‌హత్నూర్ మాజీ సర్పంచ్ జలకే పాండుర, పద్మావతి, రాజారామ్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-కాసిపేట



విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ గ్రామ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఆవరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఆర్ జీఎం కులకర్ణిలతో కలిసి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, ప్రహరీగోడ ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి స్థాయిలో చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో జిల్లా వయోజన విద్య, గ్రామీణాభివద్ధి, పంచాయతీ, సంక్షేమశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మెడికల్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా వయోజన విద్యాధికారి ఎ. పురుషోత్తం నాయక్, జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు రమణలతో కలిసి హాజరయ్యారు. మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, మెడిలైఫ్ ప్రత్యేక వైద్య నిపుణులు కమటం కుమార స్వామి, డీఆర్పీ బండ శాంకరీ, మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, భారతాని సతీష్, ఏపీఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కవిత, మేఘన, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక పాల్గొన్నారు.

ఎక్కువ శబ్ధం వచ్చే సైలెన్సర్లను బిగిస్తే కేసులే

- అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు 50 స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన వాహనాల వివరాలను వెల్లడించారు. వాహనాలకు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా వాటిని తొలగించి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా యువత కొందరు ప్రజలు శబ్దం వచ్చేలా సైలెన్సర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. ఇక నుంచి వాటిపై పూర్తి కట్టడి చేయనున్నట్టు తెలిపారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడంతో పాటు పబ్లిక్ న్యూసెన్స్ కేసు, ఎంవియాక్ట్ కేసు, పట్టణ మిషన్స్ కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి కంపెనీ నుంచి ఉన్నటు వంటి సైలెన్సర్‌ని అమర్చిన తర్వాతనే వాహనాన్ని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు, వాహనదారులు, తల్లిదండ్రులు, యువత వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సౌండ్ పొల్యూషన్ అరికట్టాలని తెలిపారు. ఇతర సైలెన్సర్లను ఏర్పాటు చేసి రోడ్లపై తిరగడానికి అనుమతి లేదని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో మోడీఫైడ్ సైలెన్సర్లను అమర్చిన 50 వాహనాలను సీజ్ చేసి, వాటి సైలెన్సర్లను స్వాధీనపరచుకోవడం జరిగిందని తెలిపారు. కంపెనీ నుంచి వచ్చే సైలెన్సర్లను ఏర్పాటు చేసుకున్న తర్వాత వారిపై కేసు నమోదు చేసి, జరిమానాలు విధించి విడిచిపెట్టడం జరుగుతుందని తెలిపారు.

రేషన్‌కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ అవసరం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రేషన్ కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటిడిఏ పిఓ ఖుష్బు గుప్తా తో కలసి రాజీవ్ యువ వికాసం పథకం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకంను ప్రారంభించిందని పేర్కొన్నారు. రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు గడువును ఈ నెల 14 వ తేదీ వరకు పొడగించడం జరిగిందనీ వివరించారు. మున్సిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ, ఈడీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ అధికారులు, నోడల్ అధికారులుగా ఉన్నారని, బ్యాంక్ మేనేజర్లు ఈ కార్యక్రమం పై ఒరియంటేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ మనోహర్, సీఈఓ, డీపీఓ, బ్యాంక్ అధికారులు, సంభందిత అధికారులు. పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను శనివారం ఉదయం 10:30గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లాలోని అధికారులు, కుల సంఘం నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు.

అభియాన్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 6 నుండి 12వ తేదీ వరకు నిర్వహించే అభియాన్ కార్యక్రమంలో బూత్ స్థాయి నుండి ప్రతి నాయకుడు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సునీల్ రెడ్డి తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి విజయ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభియాన్‌లో బూత్ స్థాయి నాయకుల నుంచి రాష్ట్రస్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని స్థాయిలలో పార్టీ కార్యాలయాలలో కార్యకర్తల ఇళ్లలో పార్టీ జెండాను ఎగురవేయాలని కార్యక్రమం మొత్తాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రగల్బాలను దొంగ హామీలను కచ్చితంగా నెరవేర్చుటకు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సెర్ల మురళీధర్, వికశిత్ భారత్ కార్యక్రమ కన్వీనర్ కొలిపాక కిరణ్, కో కన్వీనర్లు కోవ విజయ్ కుమార్, ఎలముల మల్లయ్య, బండు రాజేందర్ గౌడ్, అంబేద్కర్ ఉత్సవాల కమిటీ కన్వీనర్ అరిగేల మల్లికార్జున్ రావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణకుమారి, ఆత్రం మనోహర్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జోన్న, మొక్క జొన్న, నువ్వు, పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరానికి రూ.30వేలు ఆర్థిక సాయం అందించి, అట్టి రైతులకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాదె శంకర్, గట్టు నారాయణ, అడెపు నరేందర్, బంటు ప్రవీణ్, రాజేందర్ రెడ్డి, ఎరు రాజేశ్వర్, పరుశురాం జాదవ్, మహేందర్‌రెడ్డి, ధృవరాజు, రంజిత్ పాల్గొన్నారు.

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శ్రీ రామనవమి పండగను పురస్కరించుకొని హిందూ వాహిని బజరంగ్ దళ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించబోయే శ్రీరామ వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ వాహిని జిల్లా సహసంయోజక్ కందుల హరీష్ పిలుపు నిచ్చారు. శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను పట్టణంలోని స్థానిక ఐబీ ఆఫీస్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక హిందూ బంధువులు, యువకులు, అన్ని వ్యాపారసంఘాలు, కులసంఘాలు, నగర పుర ప్రముఖులు, హిందూ రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ఆయా సంఘాల నాయకులు మంద పవన్, ముకేష్, మనోజ్, కూన సతీష్, సాయి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి

నస్పూర్ : కలెక్టర్ కార్యాలయంలో శనివారం డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, పుర ప్రముఖులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి నాయకపుగూడకు చెందిన మేసినేని మల్లు(53) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మల్లు ముఖంపై పుండు లాంటి గాయమై ఎంతకు తగ్గకపోగా బాగా ఉండటంతో మద్యానికి అలవాటు పడింది. నొప్పి తట్టుకోలేక ఈ నెల 2న ఇంట్లో ఉన్న గుర్తు తెలియని మందు తాగి వాంతులు చేసుకోగా కుటుంబీకులు గమనించి అదే రోజు బెల్లంపల్లి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించగా, పరిస్థితి విషమించడం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త మేసినేని రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై హర్షం

నవతెలంగాణ-తాండూర్

కేంద్రం ప్రభుత్వం పేద ముస్లింల మేలుకై తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు పై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐబీ సెంటర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు పార్లమెంట్ రాజ్యసభలో ఆమోదం పొందడం గొప్ప విషయమన్నారు. దీంతో పేద ముస్లింలకు లాభం చేకూరుతుందన్నారు. బిల్లును కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు తుకారం, సురేష్, మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, ఉపాధ్యక్షులు సిద్ధం మల్లేష్, చోక్కాల నాగభూషణ్, నాయకులు తుపాకుల చంద్రయ్య, ఆవుల చందు, ధర్మరాజుల రమేష్, పుప్పాల మహేష్, ఆనంద్, జనార్ధన్ పాల్గొన్నారు

ప్రశంసా పత్రం అందుకున్న శ్రీరాంపూర్ సీఐ

నవతెలంగాణ-నస్పూర్



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రశంస పత్రాలు అందజేశారు. అందులో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్‌కు రామగుండం కమిషనరేట్‌లో సీపీ శుక్రవారం ప్రశంసపత్రం అందజేశారు. దీంతో సీఐని పలువురు అభినందించారు.

హనుమాన్ ఆలయానికి ఎమ్మెల్యే విరాళం

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నర్సాపూర్‌లో గల శ్రీ హనుమాన్ మందిరంలో ప్రతిష్ఠించే ఉత్సవ విగ్రహాన్ని ఉంచటానికి రేకుల షెడ్ నిర్మాణానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రూ. 50,000లు విరాళం ఇచ్చారని బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్ తెలిపారు. వాటిని బర్కుంట నరేందర్, నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దత్తురాం, రాజేందర్, లక్ష్మణ్, సుదర్శన్ రెడ్డి, సవీన్, గంగారం, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఆ ఏరియాల్లో పవర్ కట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ లైన్లలో మరమ్మతుల కోసం శనివారం ఉదయం 08:30 నుంచి 09:30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్, భుక్తాపూర్, సినిమారోడ్, మోచిగల్లి, ద్వారకానగర్ ఏరియాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు

నేడు పట్టణంలో శోభాయాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 6న సాయంత్రం 5 గంటలకు గోపాలకష్ణ మఠం నుంచి భవ్య రాముని భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు రాళ్లబండి మహేందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేరకుల సమావేశంలో మాట్లాడారు. ఈ ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగుతోందని తెలిపారు. సమస్త హిందూ బంధువులు వేల సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుతూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి సభ్యులు మహేందర్, సురేందర్, అభి యాదవ్, మల్లికార్జున్, చాణిక్య, మనోజ్, అజయ్, నిఖిల్, అర్జున్, స్వప్నిల్, సూర్య కిరణ్, రాకేష్, నరేందర్, ఓం ప్రకాష్ శర్మ, గోపి కిరణ్ రాంజీ ఉన్నారు.

11న శోభాయాత్ర విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుండి వీర హనుమాన్ మహా శోభాయాత్ర విజయవంతం చేయాలని బజరంగ్‌దళ్ ఆసిఫాబాద్ శాఖ సభ్యులు నవీన్ కోరారు. శోభాయాత్రకు సంబంధించి బీజేపీ జిల్లా నాయకులు సతీష్ బాబు, ఖాండ్రే విశాల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతికి ఒకరోజు ముందుగా మహా శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, నాయకులు రాంబాబు, సూర్యప్రకాష్, సచిన్ పాల్గొన్నారు.

రేపటి నుండి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-పెంబి

మండలంలోని తాటిగూడ గ్రామ శ్రీ జగదాంబ దేవి, ఓం ప్రకాష్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నుండి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకాష్ మహారాజ్ తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు, బస చేసుకోవడానికి ఏర్పాటు చేశామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.